సాక్షి
తిరుపతి

బుధవారం | 18 | డిసెంబర్ | 2024



రోలర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఓ ఆర్టీసీ బస్సు వేగంగా వెళుతూ ముందు వెళుతున్న రోడ్డు రోలర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో 42 మంది గాయపడ్డారు. - 8లో



పేదల గుండె గుడి పద్మావతి

శ్రీవారి పాదాల చెంత పురుడు పోసుకున్న పద్మావతి కార్డియాక్ సెంటర్ ఆస్పత్రి పేదల గుండె గుడిగా విరాజిల్లుతోంది. - 8లో



సిబ్బంది ఆందోళన..

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల సిబ్బంది ఆందోళనకు దిగారు. శ్రీవారి భక్తులు ఇబ్బంది పడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

నామినల్ రోల్స్ తప్పుల సవరణకు అవకాశం

తిరుపతి అర్బన్: పదో తరగతి విద్యార్థులు తమ నామినల్ రోల్స్‌లో ఏమైనా తప్పులు ఉంటే వాటి సవరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ మేరకు ఉత్తర్వులు వచ్చాయని డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాలల్లోనే నామినల్ రోల్స్‌లో తప్పుల సవరించుకోవాల్సి ఉంటుందని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగానే విద్యార్థులకు సమాచారం ఇచ్చి, విద్యార్థి పూరి వివరాలను సరిచూసుకోవాల్సి ఉందని ఆయన స్పష్టం చేశారు.

ఉచిత కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం


తిరుపతి ఎడ్యుకేషన్ : స్థానిక కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్కిల్ హబ్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నూతన కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఆ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 210 గంటల కాల వ్యవధితో కూడిన అసిస్టెంట్ టెక్నీషియన్-నెట్ వర్కింగ్ అండ్ స్టోరేజ్ కోర్సుకు పదో తరగతి, ఆపై విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 81435 76866, 99851 29995 నంబర్లలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అలాగే ''హెచ్‌టీటీపీఎస్://ఎఫ్‌ఓఆర్‌ఎంఎస్.జీఎల్ఈ/ఎక్స్‌ఈక్యూవైఎన్5డి7డియూవీడబ్ల్యూ హెచ్‌డీ3ఎస్‌డీ6'' (https://forms.gle/XeQyn5D7DUWHd3sd6) అనే వెబ్‌సైట్ లింకు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 62,112 మంది స్వామివారిని దర్శించుకోగా 22,541 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.36 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించబోరని స్పష్టం చేసింది.

అవే లైట్లు.. అదే టీవీ.. ఫ్రిజ్..ఫ్యాన్లు.. అన్నీ గతంలో విద్యుత్ ఉపకరణాలు.. ఆపై చలికాలం.. విద్యుత్ వినియోగం తక్కువలో తక్కువ. కేవలం 178 యూనిట్లే వాడకం.. అయినా బిల్లు మాత్రం రూ.వెయ్యి పైమాటే.. ఇదేందబ్బా అమాంతం ఇంత చార్జీ వచ్చిందేమిటి?.. కరెంట్ బిల్లే ఇంత కడితే ఇక బతికేదెట్టా?.. అంటూ ఓ సామాన్యుడు వ్యక్తం చేసిన ఆందోళన.. తీరా బిల్లును తరచి చూస్తే ఇదంతా కూటమి సర్దుపోటు మహిమ అని తెలిసింది. అసలు కన్నా కొసరు ఎక్కువగా వసూలు చేస్తూ సర్కార్ షాక్ ఇస్తోందని సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సామాన్యుడికి విద్యుదాఘాతం



బాదుడే...బాదుడు

- జిల్లా ప్రజలపై భారీగా విద్యుత్ చార్జీల భారం
- ఈ నెల బిల్లు నుంచి రూ.20 కోట్లు వసూలు
- ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో తాజాగా వడ్డన
- ఇప్పటికే కూటమి ప్రభుత్వం వేసిన అదనపు భారం యూనిట్‌కు 91 పైసలు
- ఇప్పుడు మరో 61 పైసలు.. మొత్తంగా రూ.1.52
- గత రెండు నెలల్లో కూటమి ప్రభుత్వం జిల్లా వాసులపై వేసిన భారం మొత్తం రూ.39.90 కోట్లు
- ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలపై బాబు గగ్గోలు

వడ్డింపు ఇలా..

తిరుపతి నగరానికి చెందిన లక్ష్మికి గత నవంబర్ నెలలో వచ్చిన విద్యుత్ బిల్లులో మొత్తం 101 యూనిట్ల విద్యుత్ వాడకం జరిగిందని, ఇందుకు మొత్తం బిల్లు రూ.493 వచ్చింది. ఇందులో విద్యుత్ వాడకం కింద రూ.309, మిగిలిన రూ.184 వివిధ చార్జీల కింద వసూలు చేస్తున్నారు. ఇందులో కొత్తగా ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో 2024 సెప్టెంబర్ లో వాడిన విద్యుత్ యూనిట్లకు రూ.60 అదనంగా వడ్డించారు. ట్రూ అప్ చార్జీలు రూ.27, సర్‌చార్జి రూ.25, కస్టమర్ చార్జీలు రూ.45, ఫిక్స్‌డ్ చార్జీలు రూ.20, ఎలక్ట్రిసిటీ డ్యూటీ కింద మరో రూ.6 ఇలా మొత్తంగా రూ.184ను వడ్డించారు.

తిరుపతి రూరల్: జిల్లా వాసులపై కూటమి ప్రభుత్వం రెండోసారి భారీ విద్యుత్ చార్జీల భారం మోపింది. జిల్లాలో మొత్తం 6.80 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి నెలా రూ.20 కోట్లు ఇంధన సర్దుబాటు చార్జీలను ప్రభుత్వం ప్రజల నుంచి వసూలు చేయడం ప్రారంభించింది. ప్రతి యూనిట్‌కు 61 పైసలు చొప్పున అదనపు భారం మోపింది. 2022 ఏడాది ఏప్రిల్ నెలలో వాడిన విద్యుత్ యూనిట్లకు సంబంధించి ఇంధన సర్దుబాటు చార్జీలు(ఎఫ్‌పీపీసీఏ)పేరుతో ఈ నెల నుంచి వసూలు చేయనుంది. ఒక్కో యూనిట్‌కు రూ.1.21 చొప్పున వసూలు చేయాలని నిర్ణయించారు. అయితే ఇది ఎక్కువ మొత్తం అవుతోందని, బిల్లు భారీగా పెరగడంతోపాటు ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తే అవకాశం ఉండడంతో దొడ్డిదారి ప్రయత్నాల ను చేసింది. ఎఫ్‌పీపీసీఏ చార్జీలను రూ.1.21 ఒకేసారి కాకుండా, ఈ నెల 61 పైసలు, మరో నెల 60 పైసలు చొప్పున దానిని విడగొట్టింది. దీంతో ఈ నెల బిల్లులో 2022 ఏప్రిల్ నెలలో వాడిన విద్యుత్ యూనిట్లకు సంబంధించి యూనిట్‌కు 61 పైసలు చొప్పున ఈ డిసెంబర్ బిల్లులో వినియోగదారులకు వచ్చింది. అంటే యూనిట్‌కు 61 పైసలు చొప్పున జిల్లా పరిధిలో ఈ నెల అదనంగా రూ.7 కోట్లకు పైగా వసూలు చేస్తున్నారు. తర్వాత నెల 60 పైసలు చొప్పున రూ.6.90 కోట్లు వసూలు చేయనున్నారు. మొత్తంగా ఎఫ్‌పీపీసీఏ ద్వారా జిల్లా ప్రజలపై రూ.13.90 కోట్లు భారం ప్రభుత్వం మోపింది. 2024 అక్టోబర్ నెల నుంచి వస్తున్న సర్దుబాటు చార్జీలకు ఇవి అధనం.

ఈ నెలలోనూ అదే తంతు

డిసెంబర్‌లో వచ్చిన బిల్లులో 89 యూనిట్లకుగాను రూ.416 బిల్లు వచ్చింది. భారీ వర్షాలు, విద్యుత్ తక్కువగా వాడినా, తక్కువ శ్లాబులో ఉన్నా కూడా ఎందుకు అంత బిల్లు వచ్చింది అని పరిశీలించగా, గత నెలలో వచ్చిన బిల్లుకు అదనంగా మరో సర్దుబాటును ప్రభుత్వం వడ్డించింది. 2022 ఏప్రిల్ నెలలో వాడిన విద్యుత్ యూనిట్లకు సర్దుబాటు పేరుతో రూ.22.76ను అదనంగా భారం మోపారు. యూనిట్‌కు 61 పైసలు చొప్పున వీటిని వినియోగదారులపై భారం మోపారు. ఇలా విద్యుత్ చార్జీలను అడ్డదిడ్డంగా వసూలు చేస్తూ సర్కారు సామాన్యుడి నడ్డి విరుస్తోంది.

ప్రతి నెలా సర్దుపోటు

ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ అడ్జస్‌మెంట్(ఎఫ్‌పీపీసీఏ) కింద ఇప్పటికే జిల్లా ప్రజలపై కూటమి ప్రభుత్వం కోట్లలో భారం మోపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంధన సర్దుబాటు పేరుతో ప్రతి నెలా వడ్డనకు తెర లేపుతున్నారు. 2022 ఏప్రిల్ నెల ఎఫ్‌పీపీసీఏ చార్జీలకు తోడుగా అక్టోబర్ నెల నుంచి ఏ నెలకు ఆ నెల సర్దుబాటు పేరుతో యూనిట్‌కు 91 పైసలు చొప్పున వడ్డిస్తున్నారు. ఇలా ప్రతి నెల దాదాపు రూ.13 కోట్లను వసూలు చేస్తున్నట్లు విద్యుత్ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇలా గత రెండు నెలల్లో జిల్లా వాసులపై దాదాపు రూ.26 కోట్ల భారం వేశారు. ఎఫ్‌పీపీసీఏ రెండు రకాల చార్జీల ద్వారా రూ.13.90 కోట్లు, రూ.26 కోట్లు చొప్పున ఇప్పటికే రూ.39.90 కోట్ల వసూలు చేశారు.



నవంబర్ నెలలో వచ్చిన బిల్లు

కరెంటు బిల్లు అంటేనే భయం వేస్తోంది



కరెంటు బిల్లు వస్తుందంటేనే భయం వేస్తోంది. చాలా రకాల చార్జీలతో మోత మోగిస్తున్నారు. చంద్రబాబు కరెంటు చార్జీలను పెంచం అని చెప్పాడు. కానీ ఇప్పుడు రకరకాల పేర్లతో భారం మోపుతున్నారు. కరెంటు చార్జీలను తగ్గించకపోతే గతంలో మాదిరి మళ్లీ చావు దెబ్బ తప్పదు.

– లలిత, గృహిణి, తిరుపతి

సర్దుబాటు తప్పదు

నిబంధనల మేరకే సర్దుబాటు చార్జీలను వేస్తున్నాం. బిల్లులో వాటిని యాడ్ చేశాం. ఏపీఈఆర్సీ ఆమోదం తర్వాతే ఈ నిర్ణయం. ట్రూ అప్ చార్జీలు త్వరలోనే ముగుస్తాయి.

– శ్రీనివాస్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, తిరుపతి సర్కిల్

నర్సింగ్ ఉద్యోగావకాశాలు

తిరుపతి అర్బన్: నర్సింగ్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పనలో భాగంగా సౌదీ అరేబియాకు పంపుతున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి లోకనాథం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓంకాప్, అల్యూసఫ్ ఎంటర్‌ప్రైజెస్ వారు సంయుక్తంగా స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్ కార్యక్రమంలో భాగంగా బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ పూర్తి చేసి ఏదైనా హాస్పటల్‌లో కనీసం ఒకటిన్నర సంవత్సరం నర్సింగ్‌లో అనుభవం కలిగి 40 ఏళ్ల లోపు మహిళలు, పురుషులకు సౌదీ అరేబియా దేశంలోని పునరావాస కేంద్రాల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఆసక్తి ఉన్నవారు ఈ నెల 31వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 87126 55686, 87901 18349, 87901 17279 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫ్లెమింగో ఫెస్టివల్ ఘనంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: సూళ్లూరుపేట పరిధిలోని పులికాట్ సరస్సుతోపాటు నేలపట్టు పక్షుల అభయారణ్యంలో ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహిద్దామని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీతో కలసి అటవీ, పర్యాటకశాఖ అధికారులతో ప్రాథమిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020 తర్వాత ఈ ఏడాదిలోనే ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇందుకు అధికారులు సహకరించాలన్నారు. ఎస్వీ జూ పార్కు క్యూరేటర్ సెల్వం, సూళ్లూరుపేట డీఎఫ్ఓ, పర్యాటకశాఖ రీజినల్ డైరెక్టర్ డా.రమణ ప్రసాద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి పట్టణం.. కలియుగవైకుంఠం.. ఆధ్యాత్మిక నిలయం.. దేవదేవుడు వేంకటేశ్వరస్వామి కొలువైన స్థలం.. పవిత్రతకు మారుపేరైన తిరునగరి ఖ్యాతి విశ్వవ్యాప్తం.. అయితే కొందరి స్వార్థం.. లాభాపేక్షే లక్ష్యంతో పడుతోంది విష సంస్కృతికి బీజం. దీని ఆదిలోనే చేయాలి అంతం.. లేకుంటే పబ్ కల్చర్ పెరిగి, భక్తిభావం కొరవడి.. పుణ్యక్షేత్రం పేరు కాక తప్పదు సర్వనాశనం. ఇందుకు ఇటీవల శ్రీవారి దేవేరి పద్మాంబ కొలువైన తిరుచానూరులో ఈవెంట్ పేరుతో జరిగిన విధ్వంసమే నిదర్శనం.. అని ఆధ్యాత్మికవేత్తలు, హిందూ సామాజిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు.



రెస్టారెంట్‌లో మద్యం మత్తులో డీజే నిర్వహణ

తిరుపతి, చంద్రగిరి నేతల అండ

మందు, విందు, చిందులతో పబ్ తరహా ఈవెంట్‌ను నిర్వహించారనే విమర్శలు ఎదుర్కొంటున్న రెస్టారెంట్ నిర్వాహకులు తిరుపతిలో ఓ వెలుగు వెలిగిన టౌన్ ప్లానింగ్ అధికారి బంధువుది కావడం గమనార్హం. దీని ఏర్పాటు వెనుక పచ్చపార్టీకి చెందిన మహిళా నాయకురాలి అల్లుడు, చంద్రగిరి నియోజకవర్గ ముఖ్యనేత హస్తం ఉందనే విమర్శలున్నాయి. ముఖ్యనేత ఇంటికి సమీపంలోనే ఈ పాడు సంస్కృతి ప్రారంభం కావడం గమనార్హం. ఈ రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి సినీ నటిని రప్పించారు. ప్రారంభించిన నాటి నుంచి కూడా ఈవెంట్ల పేరుతో పబ్‌ను తలపించేలా ఈవెంట్లు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నా ఇంతవరకు ఎలాంటి వీడియోలు, ఫొటోలు బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. పబ్ తరహా హుషారు అందించేందుకు కొందరినే లోపలికి అనుమతిస్తారు. అందుకోసం పబ్‌లోకి అనుమతి ఇచ్చినట్లు చేతికి ప్రత్యేక ట్యాగ్‌ను వేస్తున్నారు. చేతికి ఈ ప్రత్యేక ట్యాగ్ ఉంటేనే లోపలికి అనుమతిస్తారు.

ఆధ్యాత్మిక క్షేత్రం..

విష సంస్కృతికి బీజం

- పబ్‌ను తలపించేలా రెస్టారెంట్‌లో ఈవెంట్లు
- మందు, చిందు, డీజేలతో మత్తెక్కిస్తున్న వైనం
- చంద్రగిరి ముఖ్యనేత ఇంటికి సమీపంలోనే ఘటన

తిరుపతి రూరల్: ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరునగరి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వందల ఏళ్ల చరిత్ర కలిగిన తిరుపతి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విష సంస్కృతికి బీజం వేస్తున్నారు. పెద్ద పెద్ద డీజే శబ్దాలకు తోడు, కళ్లు మిరుమిట్లుగొలిపేలా డిస్కో లైట్లు, మత్తు ఎక్కించే వివిధ బ్రాండ్ల మద్యం, కిక్కెంచేలా మహిళా యాంకర్ మాటలు, మద్యం మత్తులో ఊగిపోతూ వేస్తున్న డ్యాన్సులతో పబ్‌ను తలపించేలా పద్మావతి అమ్మవారు కొలువైన తిరుచానూరుకు సమీపంలోని ఓ రెస్టారెంట్ మార్మోగిపోయింది. ఈ రెస్టారెంట్‌లో మద్యం విక్రయాలకు ఎలాంటి అనుమతులు లేవు. అయితే ఈ నెల 14వ తేదీ రాత్రి ఈవెంట్ పేరుతో ఎక్సైజ్‌శాఖ నుంచి అనుమతి తీసుకుని, అక్కడ మద్యం ఏర్పాటు చేశారు. అయితే రెస్టారెంట్‌లో రాత్రి 7 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పెద్ద పెద్ద సౌండ్‌లతో భారీ మందు పార్టీని ఏర్పాటు చేశారనే విమర్శలున్నాయి. అనుమతులు లేకుండా మహిళా యాంకర్‌తో ఈవెంట్‌ను నిర్వహించడమే కాకుండా, పబ్‌ను తలపించేలా డిస్కో లైట్లు, డీజే సౌండ్లతో హంగామా చేసినట్లు ఈవెంట్‌కు హాజరైన వారు కొందరు అనధికారికంగా తీసిన వీడియోలు మంగళవారం బయటకు రావడంతో తిరుపతి వాసులు ఉలిక్కిపడ్డారు. ఈ వీడియోల్లో మహిళా యాంకర్ డీజే సౌండ్స్‌ను ఆపరేట్ చేయడం, మందుబాబులు ఆమె దగ్గరకు రాకుండా బౌన్సర్లు రక్షణగా ఉండడం, మద్యం బాటిళ్లు, డిస్కో లైట్లు మెరుపులు అందులో కనిపిస్తున్నాయి. ఇదంతా పబ్ వాతావరణమేనని తిరుపతిలో పాడు సంస్కృతి ప్రారంభించారని పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మందుబాబు ఆరాటం

జనం ధ్యాసను దైవభక్తి వైపు మళ్లించండి



ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతికి ప్రతిరోజూ లక్ష మందికి పైగా దేశ విదేశాల్లోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ఇందులో 80 శాతం మందికిపైగా దేవదేవునిపై ఎంతో భక్తితో విచ్చేస్తుంటారు. అలాంటి వారి కోసం దైవభక్తితో కూడిన పలు కార్యక్రమాలు చేపడితే బాగుంటుంది. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా పబ్ కల్చర్‌ను తీసుకురావడం మంచిది కాదు. ఇలాంటి కార్యక్రమాలతో తిరుపతికి వచ్చే భక్తులు కూడా పక్కదారిపట్టే అవకాశం ఉంది. ఎన్నికల ప్రచారంలో ఒకటి చెప్పి తర్వాత ఇలా చేయడం ఎంతవరకు సబబు.

– ఓవీ జ్ఞానప్రకాష్, హిందూ సామాజిక వాది

పబ్ కల్చర్‌పై కఠినంగా వ్యవహరిస్తాం




తిరుపతి పవిత్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలి. పబ్ కల్చర్‌పై కఠినంగా వ్యవహరిస్తాం. పూర్తి స్థాయిలో విచారించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– సుబ్బరాయుడు, ఎస్పీ, తిరుపతి

సహకార యోజన

పథకం వివరాలు తెలపండి

- తిరుపతి ఎంపీ గురుమూర్తి



పార్లమెంట్ సమావేశాల్లో మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం : తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలో గత మూడేళ్లలో డెయిరీ సహకార యోజన పథకం కింద చేపట్టిన కార్యక్రమాల వివరాలను తెలపాలని ఎంపీ గురుమూర్తి కోరారు. ఢిల్లీ పార్లమెంట్ సమావేశాల్లో పాడి పరిశ్రమ, రైతుల సమస్యలను మంగళవారం పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మాట్లాడుతూ డెయిరీ సహకార యోజన పథకంతో లబ్ధి పొందుతున్న పాల సహకార సంఘాలెన్ని?, రైతు సంఘాల సంఖ్య, నియోజకవర్గానికి మంజూరు చేసిన నిధుల వివరాలు, పాల ఉత్పత్తుల ప్రాసెసింగ్, మార్కెటింగ్‌ను మెరుగుపరచడానికి తీసుకుంటున్న చర్యలు తెలపాలని కోరారు. అలాగే తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గంలో పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, క్రెడిట్ యాక్సెస్, ఆధునిక సాంకేతికత, మార్కెట్ అనుసంధానం తదితర అంశాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందా?, అలా అయితే ఈ సమస్యలను పరిష్కారానికి, పాడి రైతులను ఆదుకునేందుకు డెయిరీ సహకార యోజన కింద తీసుకున్న చర్యల వివరాలు తెలపాలని డిమాండ్ చేశారు. భారత ప్రభుత్వ సహకార మంత్రిత్వశాఖ పరిధిలోని నేషనల్ కోఆపరేటివ్ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాలతో దేశవ్యాప్తంగా పాడి పరిశ్రమల ప్రోత్సహించడం, అభివృద్ధి చేయడం కోసం ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని కేంద్ర సహకార శాఖా మంత్రి అమిత్ షా తెలియజేశారన్నారు. ఇందుకు అమిషా సమాధానమిస్తూ నేషనల్ కోఆపరేటివ్ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద దేశవ్యాప్తంగా 19,885 పాడి సహకార సంఘాలు లబ్ధి పొందాయని, రూ.145.81 కోట్లు ఈ సహకార సంఘాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇందులో గుజరాత్ రాష్ట్రంలో మొత్తం 9,420 పాడి సహకార సంఘాలకు రూ. 27.16 కోట్లు, తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 3,018 పాడి సహకార సంఘాలకు రూ. 51.93 కోట్లు లబ్ధి చేకూరిందని తెలిపారు. తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గానికి చెందిన ఏ డెయిరీ కూడా డెయిరీ సహకార పథకానికి దరఖాస్తు చేయనందున తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గంలో ఎటువంటి ఆర్థిక సహాయం అందించలేదని కేంద్ర మంత్రి వివరించారు.

ఆర్టీసీకి రూ.31.85 లక్షల రాబడి

తిరుపతి అర్బన్: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 13, 14, 15 తేదీల్లో జిల్లా నుంచి శైవక్షేత్రాలకు నడిపిన 148 ప్రత్యేక బస్సుల ద్వారా ఆర్టీసీకి రూ.31.85 లక్షల రాబడి వచ్చిందని జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 11 డిపోల నుంచి పలు శైవక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు నడిపామని చెప్పారు. ప్రధానంగా తిరుపతి డిపో నుంచి 37, అలిపిరి 4, తిరుమల 17, మంగళం 16, శ్రీకాళహస్తి 12, పుత్తూరు 10, సత్యవేడు 10, గూడూరు 15, సూళ్లూరుపేట 2,వెంకటగిరి 12, వాకాడు 13 సర్వీసులను నడిపామన్నారు. మూడు రోజుల్లో అమరావతి 1, ఇంద్రా 2, సూపర్‌లగ్జరీ 17, అల్ట్రా డీలక్స్ 18, సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లు 39, సాధారణ ఎక్స్‌ప్రెస్‌లు 71 శివాలయాలకు నడిపామని తెలిపారు. తిరువణ్ణామలైకి నడిపిన సర్వీసులకు మంచి స్పందన వచ్చిందని చెప్పారు. రానున్న రోజుల్లో భక్తుల అవసరాలకు అనుగుణంగా మరెన్ని సర్వీసులను నడపడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.



జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్

పేదల గుండె గుడి పద్మావతి

శ్రీవారి హృదయాలయం

- చిన్నారులకు పునర్జన్మను ప్రసాదిస్తూ.. శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్
- నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మానస పుత్రికగా ఆవిష్కరణ
- అనతి కాలంలోనే విశేష సేవలతో దేశవ్యాప్త గుర్తింపు

తిరుపతి తుడా: కలియుగ శ్రీ వెంకటేశ్వరుని నిండు ఆశీస్సులతో ఆయన పాదాల చెంత తిరుపతిలో పురుడు పోసుకున్న శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాలయం నిరుపేదల పాలిట గుండె 'గుడి'గా పూజింపబడుతోంది. ఆధ్యాత్మిక నగరంలో అరుదైన శస్త్రచికిత్సలు చేస్తూ గుండె మార్పిడికి కేంద్ర బిందువుగా మారింది. హృద్రోగ సమస్యతో బాధపడే అభం శుభం తెలియని చిన్నారులకు పునర్జన్మ కేంద్రంగా విరాజిల్లుతోంది. రూ.లక్షల వ్యయంతో కూడుకున్న వైద్యం ఎంతో మంది పేదలకు ఉచితంగా ప్రసాదిస్తూ శ్రీవారి హృదయాలయంగా దేశవ్యాప్తంగా కీర్తి తెచ్చుకుంది.

ప్రముఖ వైద్య నిపుణుల సేవలు

శ్రీ పద్మావతి కార్డియాక కేర్ సెంటర్లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో మెరుగైన చికిత్సను అందిస్తున్నారు టీటీడీ సంపూర్ణ ఆర్థిక సహకారంతో నడుస్తున్న ఈ ఆస్పత్రిలో దేశంలోని ప్రముఖ గుండె సంబంధిత వైద్య నిపుణులు ఇక్కడికి వచ్చి ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారు. ఎకో స్కానింగ్, మెడికల్ ల్యాబ్, ఎక్స్‌రే, క్యాథ్ ల్యాబ్, అడ్వాన్స్‌డ్ ల్యాబ్ వంటి ప్రపంచస్థాయి వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అలానే అత్యాధునిక ఐసీయూ సదుపాయాలను కల్పిస్తున్నారు.



ప్రత్యేక విమానంలో తీసుకొచ్చిన గుండెను చిన్నపిల్లల ఆస్పత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

ఆస్పత్రి: శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం
నిర్వహణ: తిరుమల తిరుపతి దేవస్థానం
ప్రత్యేకతలు: చిన్నపిల్లల గుండె సంబంధిత చికిత్సలు, గుండె మార్పిడి చికిత్సలు
ఆస్పత్రి స్థాపన : 11 అక్టోబర్ 2021
శస్త్ర చికిత్సలు ప్రారంభం : జనవరి 2022
డైరెక్టర్ : డాక్టర్ నరహరి శ్రీనాథరెడ్డి
ప్రముఖ వైద్య నిపుణులు : 15 మంది
మెడికల్ ఆఫీసర్లు : 8 మంది
ఆఫీసు సిబ్బంది : 92 మంది
రోజువారీ ఓపీ : 40 నుంచి 50 మంది
రోజువారీ శస్త్రచికిత్సలు: 3 నుంచి 5
ఇప్పటి వరకు మొత్తం ఓపీలు : 30,140
ఓపెన్ హార్ట్ సర్జరీలు : 3,400
కీ హార్ట్ సర్జరీ : 982
మొత్తం పడకలు : 75
ఆపరేషన్ థియేటర్లు : మూడు
ఐసీయూ: రెండు
వైద్య సదుపాయాలు: ఒక్కో అడ్వాన్స్‌డ్ క్యాథ్ ల్యాబ్, మెడికల్ ల్యాబ్, ఎక్స్‌రే, ఈసీజీ

17వ గుండె మార్పిడి ఇలా..

ఈ కార్డియాక్ కేర్ సెంటర్‌లో ఆస్పత్రిని ప్రారంభించిన నాలుగు నెలల్లోనే అంటే 2022 జనవరి 20వ తేదీన తొలి గుండె మార్పిడి చికిత్సను విజయవంతంగా చేశారు. అలా మొదలైన గుండె మార్పిడి చికిత్సలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఐదు నెలల పసికందుకు సైతం ఇక్కడ గుండె మార్పిడిని చేసి శభాష్ అనిపించుకున్నారు. మంగళవారం ప్రకాశం జిల్లాకు చెందిన 22 ఏళ్ల యువకుడికి వైజాగ్ కు చెందిన 50 ఏళ్ల వ్యక్తి గుండెను విజయవంతంగా అమర్చారు. గ్రీన్ ఛానల్ ద్వారా ప్రోటోకాల్ తో విశాఖపట్నం నుంచి ప్రత్యేక విమానం ద్వారా తిరుపతి విమానాశ్రయానికి గుండెను తీసుకువచ్చారు. అక్కడ నుంచి 20 నిమిషాల్లో గుండెను ఆస్పత్రికి చేర్చారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన గుండె మార్పిడి చికిత్స 5.45 గంటల పాటు కొనసాగింది.

నాటి ముఖ్యమంత్రి మానస పుత్రికగా..

నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మానస పుత్రికగా శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్‌గా పురుడు పోసుకుంది. 2021 సెప్టెంబర్ 11వ తేదీన శ్రీ పద్మావతి కార్డియాక కేర్ సెంటర్ను ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. మూడేళ్ల మూడు నెలల వ్యవధిలోనే 3,400 గుండె సంబంధిత ఆపరేషన్లు.. అలానే 17 గుండె మార్పిడి చికిత్సలను విజయవంతంగా చేశారు. 92 శాతం సక్సెస్ రేటుతో ఆస్పత్రి వైద్య సేవలు విజయవంతంగా ముందుకు సాగుతున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పిల్లలకు ఇక్కడ ఉచితంగా గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. గతంలో బంగ్లాదేశ్ కు చెందిన ఓ చిన్నారికి ఇక్కడ గుండె ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. ఇలా శ్రీవారి ఆశీస్సులతో నడుస్తున్న శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ వైద్య సేవలు దశ దిశలా వ్యాపించాయి. రూ.లక్షలు వెచ్చించి గుండె మార్పిడి చికిత్సలు చేయించుకోలేని పేదలకు ఈ ఆస్పత్రి వరంగా మారింది. ఇక్కడ అందిస్తున్న వైద్య సేవలకు గుర్తింపుగా ఉత్తమ పిడియాట్రిక్ కార్డియాక్ సెంటర్‌గా జాతీయస్థాయి గుర్తింపును సొంతం చేసుకుంది.

వైఎస్సార్ మాట..

అభం శుభం తెలియని ఏ పసిబిడ్డా కూడా గుండె సంబంధిత వ్యాధితో బాధపడకూడదు. వ్యాధి బారిన పడిన నా బిడ్డను డబ్బులు లేక కాపాడుకోలేకపోయాననే వేదన ఏ తల్లిదండ్రులకు మిగలకూడదు. అందుకే.. ఇందుకు ఎంత ఖర్చు అయినా ప్రభుత్వమే భరించాలి. ఆ బాధ్యత నాది అంటూ చిన్న పిల్లల గుండె సంబంధిత శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకుస్తున్నానని 2015లో నాటి ముఖ్యమంత్రి హోదాలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భరోసా ఇచ్చారు.

ఆయన తనయుడిగా..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడిగా నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరో నాలుగడుగులు ముందుకేసి, చిన్నపిల్లల గుండె సంరక్షణ బాధ్యత నాది అంటూ నడుం బిగించారు. సీఎం హోదాలో నాడు టీటీడీ అధికారులను ఆదేశించగా ఎనిమిది నెలల కాలంలోనే అత్యాధునిక సౌకర్యాలతో ఓ ఆస్పత్రిని నిర్మించారు. ఆరోగ్యశ్రీ ఉన్న ప్రతి ఒక్కరికీ ఖరీదైన గుండె సంబంధిత చికిత్సలను ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఆయన లక్ష్యానికి అనుగుణంగానే ఆస్పత్రి పురుడు పోసుకున్న అనతి కాలంలోనే విజయవంతమైన గుండె మార్పులు.. గుండె సంబంధిత శస్త్రచికిత్సలను అందిస్తూ పేదల గుండె గుడిగా మారింది.

క్లుప్తంగా

ఏడు రేసింగ్ బైక్‌ల సీజ్


యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ వెంకటనారాయణ

తిరుపతి క్రైం: నగరంలోని జూ పార్క్ రోడ్డులో స్పోర్ట్స్ బైకులతో రేసింగ్ సాధన చేస్తున్న ఏడు గురికి చెందిన వాహనాలను సీజ్ చేసినట్లు డీఎస్పీ వెంకట్ నారాయణ తెలిపారు. డీఎస్పీ కథనం మేరకు.. నగరంలోని జూ పార్క్ రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో ప్రమాదకర విన్యాసాలు నిర్వహిస్తూ ఇన్‌స్టాగామ్, వాట్సాప్‌లో పోస్టులు పెడుతున్నారు. ఇలాంటి వాటిపై నిఘా ఉంచి ఏడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి కేసు నమోదు చేసి, వాహనాలను ఆర్టీఓకు నివేదించారు. వీరంతా వాహనాలను అతివేగంగా నడుపుతూ పోటీ పడుతూ విన్యాసాలు చేస్తున్నారని డీఎస్పీ తెలిపారు. అంతేకాకుండా శబ్ద కాలుష్యం సృష్టిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. చట్ట ప్రకారం వీరిపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

వైష్ణవి కార్మికులతో చర్చలు

పెళ్లకూరు : మండలంలోని పునబాకలోని వైష్ణవి డెయిరీ కార్మికులతో మంగళవారం నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు చర్చలు జరిపారు. కొంత కాలంగా డెయిరీలో సిట్ అధికారుల బృందం తనిఖీ చేస్తోంది. అయితే మూడు రోజులుగా కంపెనీ ప్రతినిధులు పరిశ్రమలో అందుబాటులో లేకుండా మొబైల్ స్విచ్ ఆఫ్ చేయడంతో కార్మికులు పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో సీఐ తన సిబ్బందితో డెయిరీ వద్దకు చేరుకుని కార్మికులతో మాట్లాడారు. కార్మికులు సంయమనం పాటించాలని కోరారు.

వైద్యవిద్యార్థి మృతి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు- శెట్టిగుంట జాతీయ ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి దుర్మరణం చెందాడు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో చదువుతున్న అనంతపురం జిల్లా కదిరి నియోజకవర్గం నల్లమల్ల తండాకు చెందిన మహేంద్ర నాయక్ (21) బైక్‌పై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు.. మృతుడి తల్లిదండ్రులు తులసీధర్ నాయక్, తిరుపాల్ భాయిలకు విషయం తెలియజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా గొబ్బిదేవత పుర ఉత్సవం


ఊరేగుతున్న గొబ్బిదేవత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం వేడుకగా గొబ్బిదేవత పుర ఉత్సవం నిర్వహించారు. తొలుత ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవతకు పలు అభిషేకాలు చేసి, విశేషాలంకరణ చేశారురు. అనంతరం పుర ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమను అంగీకరించలేదని.. యువకుడి ఆత్మహత్య

తిరుపతి రూరల్: ఇష్టమైన అమ్మాయి తన ప్రేమను అంగీకరించలేదన్న మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం తిరుపతి రూరల్ మండలం అవిలాలలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ ఎస్కేమూర్తి కథనం మేరకు.. కాకినాడ జిల్లా శంకవరం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన పి.రాజేష్(19) ఇంటర్ చదివి, ఆర్థిక ఇబ్బందుల కారణంగా తిరుపతికి వలస వచ్చాడు. తిరుమలలోని ఓ ప్రైవేటు హోటల్‌లో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. 20 రోజుల క్రితం తిరుమల నుంచి వచ్చి అవిలాలలోని ఫ్రెండ్స్‌తో పాటు రూమ్‌లో ఉంటున్నాడు. తన ప్రేమను ఓ యువతి అంగీకరించడం లేదనే మనస్థాపంతో పలుమార్లు ఫ్రెండ్స్ వద్ద ఆవేదన వ్యక్తం చేసేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మూర్తి తెలిపారు. మృతుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించారు.

అదుపుతప్పి కారు బోల్తా


బోల్తా పడిన కారు

చిట్టమూరు(చిల్లకూరు): మండలంలోని యాకసిరి సమీపంలో మంగళవారం కారు బోల్తా పడింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. తిరుపతికి చెందిన ఐదుగురు కారులో తూపిలిపాళెం బీచ్‌కి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో చిట్టమూరు మండలం యాకసిరి సమీపంలోని గిరిజన కాలనీ మలుపు వద్దకు వచ్చే సరికి కారు అదుపుతప్పి బోల్తా పడింది. కారు నడుపుతున్న వ్యక్తి పూటుగా మద్యం సేవించి కారు నడుపుతున్నట్లు స్థానికులు తెలిపారు. దీంతోనే కారు మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడిందన్నారు. స్వల్పగాయాలతో బయటపడిన వారంతా కారును అక్కడే వదిలేసి ప్రైవేట్ వాహనంలో వెళ్లిపోయారు. ఈ విషయమై పోలీసులకు ఎటువంటి సమాచారం లేదు.

ఎరచ్రందనం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్ : ఎరచ్రందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో ఇద్దరికీ ఒక్కొక్కరికి ఐదేళ్లు జైలుశిక్ష, రూ.6 లక్షలు చొప్పున జరిమానా విధిస్తూ రాష్ట్ర ఎరచ్రందనం కేసుల విచారణ సెషన్స్ కోర్టు తిరుపతి జడ్జి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2019 అక్టోబర్ 15వ తేదీ శేషాచలం అటవీ ప్రాంతం సమీపంలోని టీఎస్ పాళెం బీట్, భూపాల్ హౌసింగ్ కాలనీ సమీపంలో టాస్క్ ఫోర్స్ ఫారెస్ట్ సిబ్బంది తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో పూతలపట్టు మండలం, అమ్మిపల్లి కొత్తూరు గ్రామానికి చెందిన పులికంటి శ్రీరాములు, తిరుపతి రూరల్, వినాయకపురానికి చెందిన దాస రమణయ్యతో పాటు మరో ఇద్దరు ఎరచ్రందనం దుంగలను తరలిస్తూ పట్టుబడ్డారు. ఫారెస్ట్ అధికారులను చూసిన మరో ఇద్దరు రెండు దుంగలను అక్కడ పడేసి పరారయ్యారు. నిందితులు శ్రీరాములు, రమణయ్యను ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 119 కిలోల నాలుగు ఎరచ్రందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దర్నీ అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఇద్దరిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరికీ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

రోడ్డు రోలర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 42 మందికి గాయాలు
- తిరుపతి సమీపంలో ఘటన


రోడ్డు రోలర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తిరుపతి రూరల్: వేగంగా వస్తున్న ఓ ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న రోడ్డు రోలర్‌ను ఢీకొనడంతో బస్సులో ఉన్న 42 మంది గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం తిరుపతి సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..చిత్తూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం తెల్లవారుజామున 50 మంది ప్రయాణికులతో బెంగళూరు నుంచి తిరుపతికి వస్తోంది. తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లి సర్కిల్ సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి పైన బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వల్ల ముందు వెళ్తున్న రోడ్డు రోలర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులోని 42 మంది తీవ్రంగా గాయపడ్డారు. బస్సు ముందు భాగంలో దాదాపు 10 లైన్ల వరకు సీట్లు ఒకదానిలో ఒకటి ఇరుక్కుపోయాయి. సమాచారం అందుకున్న తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై రామకృష్ణ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. సీట్ల మధ్య ఇరుక్కుపోయిన ప్రయాణికులను బయటకు తీశారు. క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో 28 మందికి రెండు కాళ్లు ఫ్రాక్చర్ అయ్యాయి. 10 మందికి కాళ్లతో పాటు చేతులు కూడా ఫ్రాక్చర్ అయినట్లు వైద్యులు గుర్తించారు. బస్సు కండక్టర్‌కు ఎడమ తుంటి వద్ద తీవ్రగాయం అయింది. రోడ్డు రోలర్ డ్రైవర్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఈ రోడ్డు ప్రమాద దృశ్యాన్ని చూస్తు ఓ కారు ముందు వెళ్తున్న కారును ఢీకొనడంతో మరో ముగ్గురు గాయపడ్డారు.


క్షతగాత్రులను బయటకు తీసుకువస్తున్న స్థానికులు


అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న క్షతగాత్రులు


కారు ప్రమాదంలో గాయపడిన మహిళ

సిబ్బంది ఆందోళన.. భక్తులకు వేదన

తిరుమలకు విద్యుత్ సర్వీసులు 9 గంటలు కట్

- జోక్యం చేసుకున్న జిల్లా కలెక్టర్
- తొలిసారిగా విద్యుత్ బస్సుల డ్రైవర్లు విధుల బహిష్కరణ
- ఆర్టీసీ డ్రైవర్లతో.. అధికారుల చర్చలు
- ఎట్టకేలకు తొమ్మిది గంటల తర్వాత డ్యూటీలోకి డ్రైవర్లు


అలిపిరి డిపోలో ఆగిపోయిన విద్యుత్ సర్వీసులు

తిరుపతి అర్బన్: తమ సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల సిబ్బంది ఆందోళనకు పూనుకున్నారు. దీంతో తిరుమలకు వెళ్లే భక్తులు బస్సు సౌకర్యం కొరవడి ఆవేదన చెందారు. తిరుపతి నుంచి తిరుమలకు నడుస్తున్న విద్యుత్ సర్వీసుల డ్రైవర్లు మంగళవారం విధులకు బహిష్కరించి, తమకు ఇవ్వాల్సిన పీఎఫ్ బకాయిల సమస్యను పరిష్కరిస్తేనే విధుల్లోకి వస్తామని భీష్మించారు. దీంతో తిరుమలకు నడిచే విద్యుత్ బస్సులు ఆగిపోయి, అలిపిరి డిపోకే పరిమితం అయ్యాయి. ఎట్టకేలకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ చొరవ తీసుకుని కార్మికులతో ఫోన్‌లో చర్చించి, సమస్యను సర్దుబాటు చేశారు. అనంతరం డ్రైవర్ల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్, అలిపిరి డీఎం హరిబాబును ఆదేశించారు. దీంతో వారు సైతం కార్మిక సంఘ నేతలతో చర్చలు జరిపి, విధుల్లోకి రావాలని ఆహ్వానించారు. దీంతో బస్సులు మళ్లీ యథావిధిగా నడిచాయి. కాగా గతంలోనూ విద్యుత్ బస్సుల డ్రైవర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ఒకటి రెండు సందర్భాల్లో అలిపిరి డిపో వద్దే నిరసనలు చేసిన సంఘటనలు ఉన్నాయి. అయితే తొలిసారిగా విధులకు దూరం అయ్యారు.

గత సర్కార్‌లో 100 విద్యుత్ బస్సులు


రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా తిరుపతి జిల్లాలోని అలిపిరి డిపోకు మొట్టమొదటి సారిగా ఏకంగా 100 విద్యుత్ బస్సులను నిర్వహించే అవకాశం 2022 సెప్టెంబర్‌లో దక్కింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అలిపిరి డిపో కేంద్రంగా 100 విద్యుత్ బస్సులను నడిపేలా చర్యలు చేపట్టారు. తిరుపతి నుంచి తిరుమలకు 50 సర్వీసులు, తిరుపతి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు 14 సర్వీసులు, తిరుపతి నుంచి కడపకు 12, తిరుపతి నుంచి మదనపల్లెకు 12, తిరుపతి నుంచి నెల్లూరుకు 12 సర్వీసులు ఏర్పాటు చేశారు. ఓ వైపు పర్యావరణ పరిరక్షణకు మరోవైపు ప్రయాణికులకు సకల సౌకర్యాలతో విద్యుత్ ఏసీ సర్వీసులను అందుబాటులోకి తీసుకురావడంతో, అందులో ప్రయాణం చేయడానికి ప్రయాణికులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. గత సర్కార్‌లోనే 2020లో ఆదే అలిపిరి డిపోలో డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేశారు. అక్కడే హెవీ డ్రైవింగ్‌కు శిక్షణ ఇవ్వడంతోపాటు వారికే ఉపాధి అవకాశాల్లో భాగంగా విద్యుత్ బస్సుల్లో డ్రైవర్లుగా పనిచేసే అవకాశాన్ని కల్పించారు. అయితే కూటమి సర్కార్‌లో విద్యుత్ బస్సులను సక్రమంగా నిర్వహించలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉందని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం రాత్రి కలెక్టర్‌తోపాటు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుతో కలసి రోడ్డు భద్రతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా వర్షాలతో దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని సూచించారు. మరోవైపు రోడ్డుకిరువైపులా వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. నిర్ణీత ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు పార్కింగ్ చేయాలని చెప్పారు. అలాగే ప్రమాదకరమైన మలుపులను గుర్తించి, తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాహనచోదకులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ వాడకంపై విద్యార్థులు, యువతకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. రవాణాశాఖతో పాటు పోలీసు శాఖ సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ మురళీమోహన్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అఖండ శివనామ సంకీర్తన ప్రారంభం


భజన చేస్తున్న కళాకారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని రెండో గేటు వద్ద అఖండ శివనామ సంకీర్తన, నిత్యభజనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తకన్నప్ప జానపద కళాక్షేత్రం సభ్యుడు సంక్రాంతి వెంకటయ్య మాట్లాడుతూ తమకు శివ నామ సంకీర్తన అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈఓ బాపిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నిత్యభజనలు చేసే వారికి స్వామి అమ్మవార్ల శీఘ్ర దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేయాలని కోరారు.

వీడిన హత్య మిస్టరీ


ప్రభాకర్(ఫైల్)


అవశేషాలకు పంచనామా చేస్తున్న పోలీసులు, వైద్యులు

శ్రీకాళహస్తి: రెండు నెల తరువాత హత్య కేసు మిస్టరీ వీడింది. తన భార్యతో సన్నిహితంగా ఉంటున్నాడనే ఉద్దేశంతో ఓ భర్త ఎలక్ట్రీషియన్‌ను హత్య చేసిన ఘటన చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి ఒకటో పట్టణ సీఐ గోపి కథనం మేరకు.. ఏర్పేడు మండలం పల్లం గొల్లపల్లెకు చెందిన వెంకటేష్, అతడి భార్య వసంతతో శ్రీకాళహస్తి పట్టణంలోని కొత్తపేటతో కాపురం పెట్టాడు. ఆ ప్రాంతంలోనే అన్నమయ్య జిల్లా పుల్లంపేటకు చెందిన ఎలక్ట్రీషియన్ ప్రభాకర్ ఓ మిత్రునితో కలిసి అక్కడే అద్దె గదిలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వెంకటేష్ భార్య వసంతతో ప్రభాకర్ సన్నిహితంగా ఉండేవాడు. ఇది గమనించిన భర్త వెంకటేష్, అతని బంధువులు వారిని మందలించారు. అయినా వారు మారలేదు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో వెంకటేష్ తన స్వగ్రామమైన పల్లం గొల్లపల్లెకు వెళ్లిపోయాడు. అక్టోబరు 24న తన భార్య సోదరుడు సుబ్రమణ్యం అల్లుడు హేమంత్‌కుమార్‌తో కలిసి ప్రభాకర్ మద్యం సేవించాలని పల్లం గొల్లపల్లెకు తీసుకెళ్లారు. పూటుగా మద్యం సేవించి మత్తులోకి జారుకున్న ప్రభాకర్‌ను వారు బండరాయితో మోది హత్య చేశారు. కాలువ పక్కనే పూడ్చి పెట్టారు. గత నెల 25న ప్రభాకర్ భార్య సుధ శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీసులకు తన భర్త అదృశ్యంపై ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో హత్య విషయం వెలుగులోకి రావడంతో మంగళవారం పల్లం గొల్లపల్లికి చేరుకుని ప్రభాకర్ మృతదేహాన్ని వెలికి తీసి అవశేషాలకు పంచనామా నిర్వహించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

ఇష్టారాజ్యంగా అధికార పార్టీ నాయకుల దందా


గ్రావెల్ తవ్వి టిప్పర్‌కు లోడ్ చేస్తున్న జేసీబీ


గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్

చిల్లకూరు: ప్రకృతి సంపద కొల్లగొట్టడంలో తమకు తామే సాటి అని నిరూపించుకున్నారు అధికారపార్టీ నాయకులు. రాత్రి, పగలు తేడా లేకుండా భారీ యంత్రాలతో ఇష్టానుసారంగా గ్రావెల్‌ను తవ్వి, అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గూడూరు మున్సిపల్ పరిధిలోని టిడ్కో ఇళ్లకు సమీపంలో రెండు రోజులుగా భారీ యంత్రాలతో గ్రావెల్‌ను అక్రమంగా తవ్వి, తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆ ప్రాంతానికి చెందిప అధికారపార్టీ నాయకుడు మమ్మల్ని ఎవరు అడిగేది అనే ధీమాతో రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా గ్రావెల్‌ను తవ్వి, తరలిస్తున్నారు. గూడూరు ప్రాంతంలో ఇబ్బడిముబ్బడిగా రియల్ ఎస్టేట్లు వెలుస్తుండడంతో గ్రావెల్‌కు మంచి గిరాకీ ఏర్పడింది. ఈ క్రమంలోనే గాంధీనగర్ ప్రాంతంలోని టిడ్కో ఇళ్లకు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిపై ఆ ప్రాంతంలోని అధికారపార్టీ నాయకుడు కన్నేసి ఇష్టారాజ్యంగా గ్రావెల్‌ను తవ్వేస్తున్నాడు. ప్రతి రోజు కనీసం 50 నుంచి 60 టిప్పర్లు గ్రావెల్ తరలిపోతుంది. ఒక టిప్పరు రూ.30 వేల నుంచి రూ.40 వేలు ధర పలుకుతోంది. ఇందులో అన్ని శాఖలకు ముడుపులు ముట్టుతుండడంతో అటు రెవెన్యూ, ఇటు పోలీసు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. అధికారులు స్పందించి గ్రావెల్ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది. గత రెండు రోజులు నుంచి జరుగుతున్న తవ్వకాలపై గూడూరు తహసీల్దార్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా తనకు సమాచారం అందిందని, సిబ్బందిని పంపి పరిశీలిస్తామని తెలిపారు.